

# ధర్మజుని తీర్పు

''రోజూ మీతో వాదులాటా, కీచులాటా ఆడే కన్న ధర్మం తెలిసిన, ధర్మాసనం మీదుండే వారి యెదుట మనిద్దరం యెవరి తరపున వారు వకాలత్ పుచ్చుకుని వాదించు కుందాము. గూడెంలోని వారు, లేకి మూకా అనుకోరూ వినలేనివారూ! అందితే జుట్టూ అందకపోతే కాళ్లూ రెండే మార్గాలనుకోరూ యిరుగూ పొరుగూ! అందుకని ద్వాపరయుగంలోని వ్యక్తి ధర్మజుని తీర్పరిగా వచ్చి ధర్మాసనం మీద కూచుని వాద ప్రతివాదాలు విని తీర్పు యివ్వరమ్మని ప్రార్థించాను. ఆ ధర్మజుడెంతో దయతో తప్పక వస్తాననీ తీర్పు యిస్తాననీ మాటిచ్చారు. మీ కెప్పుడు వీలౌతుందో చెపితే ఆనాడే ఆ టైమ్‌కే వస్తానన్నారు ధర్మజులు'' అన్నది పాంచాలి.

అది రాత్రి నిద్రవేళ. అది బెడ్ రూమ్. ప్రతివాది పట్టెమంచం మీద పరుపుమీద సుఖంగా శయనించి వున్నాడు. తల్లింపు దిక్కున గోడకు బార్‌లైట్ వెలుగుతున్నది. దానిని ఆర్పే మీట ప్లాస్టిక్ తాడుతో కిందికి వేలాడుతూ ప్రతివాదికి అందుబాటులో వున్నది. చేతుల్లో కథల సంపుటి తెరిచివున్నది. కథలన్నీ పౌరాణికాలే. ప్రతివాదికి పురాణగాథలు తెలియవు. పద్దెనిమిది పురాణాలతో పరిచయం లేదు.

'' ఆరేగా పురాణాలూ?'' అని దీర్ఘం తీయగానే పాంచాలి కస్సుమని తాచు లేచినట్టు తలెత్తి ''ఆరు శాస్త్రాలండీ. పురాణాలు పద్దెనిమిది'' అని బుసకొట్టినట్టు అంటుంది. పురాణాలలో యేమున్నదో అసలే తెలియదు. పెద్ద కథ అనుకుంటాడు. రక్తపోటు వల్ల నిద్రబట్టక, పట్టినా త్వరగానే కళ్లు తెరుపుడు బడతై. సిస్టమాటిగ్గా లైఫ్ గడిపాడు గనక గభిక్కిన మంచం దిగడు. కళ్లు

మూసుకుని పుస్తకంలాగా పడుకుని నిద్ర పట్టించుకోవాలని ట్రై చేస్తాడు. గదిలో మరో వ్యక్తి లేకపోతే దీపం వేసి, తలగడా కింది కథల సంపుటి తీసి వదిలేసి గుర్తుపెట్టిన చోటు తిప్పి చదువుతాడు. విజన్ సరిగాలేక, అద్దాల పవర్ చాలక, అచ్చు నల్లగాలేక, కథ చదువుతూ అర్థం చేసుకుంటుండగా కళ్లు టైరై బరువెక్కి నిద్ర వస్తుంది. దీపం ఆర్పేసి నిద్రబోతాడు.

పాంచాలిని ఖండించటం, ఓడించటం, రెచ్చగొట్టటం యిష్టం. పొద్దుబోవాలిగా. ఓం ఓం అని యెంత సేపన్నా ఆనందం యివ్వదు. పాంచాలిని చూడకుండానే అన్నాడు.

''ధర్మజునికి వీలున్నప్పుడే రావచ్చు. నాకేం యిబ్బంది లేదు. నా తరఫున నేనే వాదించుకోగలను. నేను న్యాయవాదిని. నీకే వాదించుకోటం రాక, శేషం కోపేన పూరయేత్ అని గొంతు వాల్యూమ్ హెచ్చించి, చేతులు జాడిస్తూ అరుస్తూ కొట్టటానికి గూడా వెరవ్వు. ఆవేశపడితే లాభమా'' మంద్ర స్వరంలో యీడుస్తూ అన్నాడు.

జవాబు లేదు. పక్కకి చూస్తే నేలమీద చాపమీదున్న పాంచాలి నిద్రలో కొరిగి కంటబడింది.

గోడ గడియారం వంక చూస్తే, పెండ్యులమ్ కదులుతూ రెండు ముళ్లూ పన్నెండు చేరినాయని చూపింది. గంటలు మొదలైనై. పన్నెండు లెక్క పూర్తికాక ముందే నిద్రముంచేసింది. అలవాటు ప్రకారం చేయి మీట మీదికెక్కింది. దీపం ఆరింది.

## 2

న్యాయ స్థానం డాబూ దర్పం గలిగి వుండటమే గాక ధర్మాసనం పసందుగా వున్నది. వెంటిలేషన్ బాగున్నది. విద్యుత్తు సాయంతో గాలిపంకాలు తిరుగుతున్నాయి. పంకా పుల్లరుగాని, వీవన వీచే దాసిగానీ అవసరం లేదు.

ధర్మజుడు సంతోషించి, న్యాయాధీశుని వేషంలో, గంభీర ముద్రపట్టి ఆసనం నిండుగా కూచున్నాడు.

యెదురెదురుగా బోనుల్లో వాది ప్రతివాదులు నిలబడి వున్నారు. ధర్మజుడు తలెత్తి నిదానంగా చూశాడు.

''ప్రిలిమనరి హియరింగ్ నేనే చెప్తా న్యాయాధిపతీ, నీ పోలికలు గలిగి అలాగే శాంత గంభీరుడల్లే కనబడుతూ, యెదుటి బోనులో నిలబడి వున్నాడే వాడే ప్రతివాది. పేరు గూడా ఆధునికంగా మారిన ధర్మారావు. కలియుగంలో అలా మారుస్తారు. నా పేరు పాంచాలి. నేను వాదిని. నా వారు పెక్కేండ్లు సౌత్ ఆర్కాట్ అంటే దక్షిణ పథాన నివసించటం వల్ల, నాల్గు తరాలనించీ ఆ పేరు పెడ్తూ వచ్చారు. ముత్తవ, అమ్మమ్మ, తల్లి, కూతురు, నేను మనుమరాలిని. పెద్దలను గౌరవిస్తున్నామనుకుని పెట్టేశారు. ప్రతివాది స్వభావం గూడా చాలా వరకు నీ స్వభావమే న్యాయాధిపతీ'' అని వూపిరి తీసుకున్నది వాది పాంచాలి.

ధర్మజునికి వినోదం కలిగి అడిగాడు.

''నా స్వభావమెటువంటిదమ్మా? విందాము''.

వాది చెప్పుకెళ్లింది. 'పేరు ధర్మరాజు పెనువేపవిత్తంద్రు'' అన్నారు నిన్ను.

''నేను తమ్మి మొగ్గరంలోకి పోనో దేముడా! పోవద్దనీ, తిరిగి రావటం తెలియదనీ, చెప్పి మా నాన్న ఆంక్ష పెట్టాడు'' అని అభిమన్యుడు మొత్తుకున్నా వినక, ''పెత్తండ్రి భీముడూ, పింతండ్రి నకులుడూ సాయమొస్తారు సుభద్రా కుమారా'' అని మెత్తని కత్తిలాగా మాట్లాడుతూ, ''నీకే విజయంబు'' అని దీవిస్తున్నట్టు పలుకుతూ తిట్టి పంపావు. అభిమన్యుడు తిరిగి రానేలేదు. మాకు ఒక గొప్ప అందమైన లీడరుండేవాడు. వాడు ప్రచారానికి బయలుదేరాడు. గెలవాలనే. వాడిని అదే పార్టీ సభ్యులు వెనకనించి దీవించారు''. వీడు ప్రచారం చేస్తానని దక్షిణ వేపు వెళ్తున్నాడు. తిరిగి వచ్చినప్పటిమాట''. ఆ యువక లీడరు తిరిగిరానే లేదు అచ్చు అభిమన్యునిలాగే''.

''నేను కారణంగాదమ్మా. గురువు దారుణానికి తలపడ్డాడు. మొగ్గరం మొదట్లో సైంధవుడడ్డుపడ్డాడు'' అన్నాడు శాంతంగా.

''ధర్మజా! నీవు తాతగారు భీష్మాచార్యునే సంప్రతిస్తూ తనను సంప్రదించటంలేదని గురువు ద్రోణునికి మనసులో గుర్రుగా వుండేది. ఆశ్రితుడనని తలుస్తున్నాడు ధర్మజుడు. గురువునని తలచటం లేదు అనుకునేవాడు. సైంధవుని చంపుతానని నీ పెద్ద తమ్ముడు అంటే అప్పుడూ అలాగే ''బావమరిది దుస్సల విధవరాలౌతుంది వదిలేయమన్నావు''. తమ్ముడికి విసుగు గలిగింది. ''యెప్పుడు పనికి అడ్డు పడతాడు అన్న'' అని బాధపడి ''పాండవదాసుడిని'' అని చెప్పుకో ఫో అని పంచశిఖలుంచి తక్కిన జుట్టు తీసేసి వదిలేశాడు. వాడేమో శివుని మెప్పించి '' ఒక రోజన్నా ఆ భీముని యెదుర్కోవాలి'' అని వరం పొందాడు. గురువు పస్తాయిస్తే రాజరాజు దూషించాడు. ''శిష్యుని కొడుకని వాడితో ఆడుతున్నావు గురూ''. దానికి

గురువు నొచ్చుకుని, ''అభిమన్యు కృష్ణుని మేనల్లుడు. అంతటి వాడే. వాడిని నేలగూల్చాలంటే పదిమంది మహారధులు యెదుర్కొనాలి'' అన్నాడు. వేగిరం పదిమందిని సమకూర్చాడు రాజరాజు. అర్జునుడందేవరకు నీవు ఆగితే సరిపోలేదూ! అలాగే యీ ధర్మారావూ, నే మొత్తుకుంటున్నా వినక, నోరూరించి వైద్యశాస్త్ర మనే తమ్మి మొగ్గరంలోకి నెట్టాడు నన్ను'' అని చెప్తుండగా వాది కళ్లు తడి అయి గొంతు వణికింది.

ధర్మజుడు సానుభూతితో చూశాడు. జాలిపడ్డాడు. వాది యెగబీల్చి, యెక్కిళ్లు రాకండా సంబాళించుకుని ముక్కు నలుపుకుని నార్మల్సీకి వచ్చేదాకా వేచి చూశాడు.

''బాగున్నావుగా పాంచాలీ! నిందిస్తావెందుకు?''

''చెప్తా న్యాయాధిపతీ! నాకు శాస్త్ర మే రాదు. అభిరుచీ లేదు. యేదో కాల్బంటులాగా, గుమస్తాగా పనికి వచ్చే చదువుచాలని మొరబెట్టుకుంటే యీ మోసకారి ప్రతివాది ధర్మన్న డామినేట్ చేసి మోసగించాడు''.

''యెలా మోసగించాడు?''

''వైద్యశాస్త్రం కానిచ్చి, శస్త్ర చికిత్సలో నిపుణురాలివైతే, రోగులు బొచ్చెలతో వరహాలు తెచ్చి నీ బొంద మీద బోర్లిస్తారు. రెండు చేతులా ఆర్జించి, నీ యిష్టమొచ్చినట్టు ఖర్చు చేసుకుందువుగాని'' అని లొట్ట వేయించాడు. కాని ధర్మజా! వైద్య శాస్త్రానికి పురుట్లో సంధికొట్టింది. పురుడు వెళ్లనే లేదు'' అని నవ్వూ యేడుపూ కలిపి విషాదంగా నవ్వింది వాది.

''ప్రతివాది పరిస్థితి విషమించిందని చూసి ఆదుకోలేదూ?'' అని ప్రశ్నించాడు న్యాయాధీశుడు.

''ప్రాచీన కాలంలో దేవదానవ యుద్ధాలు జరిగేవనీ, వాటిల్లో చక్రవర్తులూ, సమర్థులూ పాల్గొనేవారినీ, ధర్మపక్షాన పోరాడేవారనీ పురాణగాథలున్నాయి. తెలుసు గదూ న్యాయాధిపతీ? దుష్యంత చక్రవర్తి దేవదానవ యుద్ధంలో దేవతల వేపు పోరాడటానికి వెళ్లాడు. సరీగ్గా యీ కలియుగంలో గూడా దేవదానవ యుద్ధంలో దేవతల వేపు పోరాడటానికి ప్రతివాది వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ గాలిలో దీపం బెట్టి ''దేవుడా నీ మహిమ!'' అని వెళ్లాడు అని హేళనగా నవ్వుతూ ప్రతివాది వంక చూసింది.

'సరిగా చెప్పమ్మా పాంచాలీ! మరీ గూఢంగా చెప్పావు'' అన్నాడు ధర్మజుడు.

''ప్రతివాది హస్తినాపూర్లో లేని సమయంలో, అందుబాటులో లేని సమయంలో నేనక్కడ శకుంతలలాగా వెలిశాను. అన్ని సహాయాలు బంద్ అయాయి. దాని పేరు హస్తినాపూర్ బంద్ అంటే బాగుంటుంది, న్యాయాధీశా!'' ధర్మజుడు ప్రతివాది వంక చూశాడు.

''యేమని చెప్పుకుంటావు? నీవు చెప్పేది నీకే హాని చేయచ్చు. ఆలోచించి చెప్పు'' అన్నాడు.

యెలా సమర్థించుకోవాలా? యెలా వాదిస్తే గెలుస్తానా అని చూచాడు ప్రతివాది. ఆలోచిస్తున్నాడు.

వాది అరిచింది. ''నువ్వు ద్రౌపదిని పణంబెడితే, ఆమెనూ ఓడితే, '' అ

దాసిని జుట్టు పట్టుకు యీడ్చుకొచ్చి, యీ సభలో వివస్త్రను చేయి'' అని తమ్ముడు దుశ్శాసనుని ఆజ్ఞాపించాడు రాజరాజు ధుర్యోధనుడు. ద్రౌపదిని సభలోకి లాక్కురాగానే, రాజ రాజు మీసం మెలేసి, విషపునవ్వు నవ్వుతూ, కుడి తొడమీద చేతితో తట్టుతూ, ''దాసీ! యిలా వచ్చి నా తొడమీద కూచో''. పతులైదుగురు చేష్టలు దక్కి గుడ్లు పెట్టుకు చూస్తూవుండిపోతే, తలలు వంచితే,

''విశ్వాసముతోడనిన్ గొలువ వచ్చె నదియున్ తలంపవే?'' అని అన్న కృష్ణుడు రాయబారిగా వెళ్తున్నప్పుడు ద్రౌపది గుర్తు చేసింది. సరీగ్గా అలాగే యీ అపర ధర్మారావు చేష్టలుడిగి'' అంటున్నది పాంచాలి.

న్యాయాధీశుడటు దృష్టి సారిస్తే సరీగ్గా జుట్టు విరబోసుకున్న ద్రౌపదిలాగే కనబడింది పాంచాలి.

'' ఇద్దరి తప్పులొక్కసారే నిరూపిస్తున్నదే యీ పాంచాలి'' అని న్యాయాధీశుడు తలవంచుకున్నాడు.

ప్రతివాది అందుకున్నాడు. ''పొరపాటు జరిగిందని గుర్తించగానే దిద్దుకున్నాను యువరానర్! అలా జరుగుతుందని వూహించలేక పోయాను. మానవత వున్నదనీ, అది చూపుతారనీ ఆశించాను. తప్పు చేయనివాడు ధరణిలేనేలేడు. ఉర్విజనులకెల్ల నుండు తప్పు అన్నారు. అంతేగాక టు ఎర్ యీజ్‌హ్యూమన్. నేనేమీ దేముడిని కాను. దిద్దుకున్నాను. అన్ని సదుపాయాలూ రొక్కం గూడా సమకూర్చాను. మానవత చూపాలనే నింపాదిగా కాలం కలిసి రాగానే తెచ్చి దగ్గర పెట్టుకున్నాను. కాపాడుకున్నాను యువరానర్! మన్నించాలి'' అన్నాడు.

వాది టెర్రరిస్టులాగా చూచి అన్నది.

''అదేం కాపాడటం? నన్ను ద్వేషించి, కించపరిచి నష్టపెట్టిన వారిని తెచ్చి ఆదరించి పూజించి, నా చేత గూడా పూజలు చేయించటం సబబా న్యాయాధిపతీ? భీముడు చంపుతాననగానే నీవు చంపనిచ్చినట్లయితే సైంధవుడు మొగ్గరం మొదట్లో భీమునికి అడ్డుపడగలిగేవాడా? అడవులలో కొచ్చి దుర్యోధనాదులు అవమానింపబడితే నీవే వెళ్లి వారి నాదుకుని విడిపించి వదిలి పంపేశావు''.

''చిత్రరథుడే ఆశ్చర్యపోయాడు. అలాగే యీ ధర్మన్నా, నేనున్న చోటికి వచ్చి, నన్ను తప్పు పట్టిన వారిని సన్మానించి మరీ పంపాడు ధర్మజా! అదేమంటే, అది మానవత్వమన్నాడు. నేనేనట తెలివితక్కువదాన్ని. నువ్వు ద్రౌపదిని తప్పుపట్టావు. జుట్టిరబోసుకుని పిరుదులు తిప్పుతూ మగవాడెదుట తిరిగితే మగవాడూరుకుంటాడా అని కీచకుని పక్షం మాట్లాడావు. అలాగే యీ ధర్మారావూ, వీరు వారని లేకుండా అందరెదుటా నన్నే తప్పుపడతాడు. ఏమని తీర్పు యిస్తారో తెలుసుకుందామనే నిన్ను ప్రార్థించాను ధర్మజా!'' అది దెప్పుడులాగా ధ్వనించింది.

ప్రతివాది వాదించాడు. ''అలా చేసినవారికి కీర్తి రాదనీ, వారిని గురించి మంచి చెప్పుకోరనీ, నీకు చెడ్డ పేరు రాదనీ, నీ మంచీ, సహనం, సౌశీల్యం నీతోనే వుంటాయనీ, నీకు పోయేదేమీ లేదనీ సద్ది చెపితే వినిపించుకోదూ, అర్థం చేసుకోదు వాది. పెద్ద మనసు కాదది అని గూడా తెలియజెప్పాను. యానైఫరానై అంటుంది. అటువంటి ఆలోచనా, పాతపగలూ, తగ్గించేందుకే ఆస్తీకుడనే గొప్ప వ్యక్తి జనమేజయ చక్రవర్తి చేత సర్పయాగమనే యుద్ధం ఆపివేయించగలిగాడు,

యువరానర్!''.

''విన్నావుగా ధర్మజా! నీ యెదుటే నన్ను తప్పుపట్టాడీ ధర్మారావు. బతికివున్నన్నాళ్లూ అణిగివుండాల్సిందేనా? యేమిటి ఒరుగుతుంది? నీవేమన్నా మంచి తీర్పు చెపుతావేమోనని తలచాను న్యాయాధిపతీ!'' విచారంగా అన్నది వాది.

''విచారించకు తల్లీ, నే చెప్పేదేమనగా, మొదటి ప్రపంచ సంగ్రామం చివర చేసిన సంధిలో మోసమున్నదనీ, నిన్నటివరకు హోదాలో వున్న సైన్యాధిపతుల నవమానించరాదనీ, మళ్లా యుద్ధం రావటానికవకాశమిస్తున్నారని, ఫిలాసఫర్స్ అన్నారు. అలాగే ప్రపంచ సంగ్రామం రెండవసారి రానే వచ్చింది. అలాగ యీ అవమానాలూ తగాదాల వల్ల మళ్లా యుద్ధం వస్తుంది. దేర్ విల్ బి హెవీ లాసెస్ ఆన్ యైదర్ సైడ్. మహామహులు, హేమాహేమీలు నేలకొరుగుతారు. న్యాయన్యాయాలు పాటించరు. చివరకు ధర్మమే గెలుస్తుంది. దానంతటదే గెలుస్తుంది. భగవంతుడు గెలిపిస్తాడు'' అని చెపుతూ తలెత్తి పాంచాలి వంక చూశాడు ధర్మజుడు.

తోడు దొంగల్ని చూసినట్టు చూసింది పాంచాలి ప్రతివాదినీ న్యాయాధీశునీ. కళ్లు పెద్దవైనై.

''సరీగ్గా ద్రౌపది చూసినట్టే చూస్తున్నదీ పాంచాలి వాది. ద్రౌపది తిట్టేది. ఈ పాంచాలి కొట్టను గూడా కొడుతుందేమో యెంత తీవ్రత ఆ చూపులో!'' అని తలుస్తూ ధర్మాసనంలోని ధర్మజుడు అదృశ్యుడైనాడు.

వాది తన బోనులోంచి ఒక్క దూకు దూకి న్యాయాధీశుని పట్టుకోవాలని పరుగెత్తింది.

3

''కలవరిస్తున్నావు. మేలుకో పాంచాలీ. నిద్రట్లో గూడా ఆవేశపడుతున్నావు'' అని కుదిపాడు ధర్మారావు.

సరిగా మెలకువ రాక పాంచాలి లేచి యిటూ అటూ పరుగెత్తింది. ''అన్యాయమూ, అధర్మమూ సహించాలా?'' అని లేచి పరుగెత్తబోయింది.

ధర్మారావు గట్టిగా పట్టుకుని మొహాన నీళ్లు చల్లాడు.